అక్కరకు రాని రైతుబజార్



కృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన రైతు బజార్

- ధ్వంసమైన గోడలు, మరుగుదొడ్లు
- కృష్ణాపూర్‌లో తాగుబోతులకు అడ్డగా మారిన వైనం
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న గ్రామస్తులు

ధన్వాడ: మండలకేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజారులు నిరుపయోగంగా మారాయి. రైతులు తాము పండించిన కూరగాయలను గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా అలాగే ప్రజల వినియోగార్థం మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతనంగా రైతు బజారును రూ. 22.లక్షలు వ్యయం చేసి నిర్మాణం చేశారు. ఇక్కడ ప్రతి గురువారం సంత నిర్వహిస్తారు. ఈ సంతలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు, రైతులు వారి కూరగాయలు ఇతర వస్తువులను అమ్మకాలు చేస్తుంటారు. దాదాపు 150 మందికి పైగా రైతులు ఇక్కమ అమ్మకాలు చేసేందుకు వస్తుంటారు. అయితే రైతు బజారు స్థలం చిన్నగా ఉండడంతో 50 మంది వరకు మాత్రమే అమ్మకాలు చేసే విధంగా నిర్మాణం చేశారు. దీంతో స్థలం సరిపోక రైతులు రోడ్లపైనే అమ్మకాలు జరుపుతున్నారు.

కృష్ణాపూర్‌లో శిథిలావస్థకు..

ధన్వాడ మండలకేంద్రంలో నిర్మించడానికి ముందు కృష్ణాపూర్‌లో రూ.13.54 లక్షలతో 2023లో ఓ రైతు బజారును ఏర్పాటు చేశారు. అయితే అది గ్రామానికి దూరంగా నిర్మాణం చేపట్టడంతో ప్రజలు ఎవరు అటువైపు వెళ్లకపోవడంతో రైతు బజారుకు తాళం పడింది. ఇదే అదనుగా కొంత మంది రాత్రి సమయంలో మద్యం తాగేందుకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మార్చుకున్నారు. రైతులు కూర్చొనేందుకు నిర్మించిన గొడలను పగలగొట్టారు. మరుగుదొడ్లకు ఏర్పాటు చేసిన తలుపులను విరగొట్టారు. దీంతో వినియోగంలోకి రాకముందే రైతు బజారు శిథిలావస్థకు చేరిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెకు ఇస్తే పంచాయతీకి నిధులు..

ధన్వాడ, కృష్ణాపూర్‌లోని రైతు బజారులలో అమ్మకాలు జరిపేలా వ్యాపారులకు కేటాయిస్తే రోజు అమ్మకాలు చేయడంతో పాటు సంత రోజు కూడా వ్యాపారులు అమ్మకాలు చేసేందుకు వీలుంటుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అంతే కాకుండా గ్రామపంచాయతీకి నిధులు కూడ సమకూరుతాయని, పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

గ్రామంలో రైతు బజారును నిర్మించి వదిలేశారు. దీంతో అది అసాంఘిక కార్యక్రమలకు అడ్డగా మారింది. మందుబాబులు తలుపులు, గొడలను పగులగొట్టారు. ఇలాగే వదిలేస్తే శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు స్పందించి వెంటనే వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, కృష్ణాపూర్

వేలం వేసినా రావడం లేదు

రైతు బజారుల నిర్వహణ కోసం రెండు సార్లు వేలం వేశాం. ఎవరు ముందుకు రాలేదు. ప్రత్యామ్నాయం చూస్తున్నాం. రైతు బజారులకు మరమ్మతు సర్పంచు ఎలక్షన్ల తరువాత చేయిస్తాం. అసాంఘిక కార్యక్రమలు జరుగుతున్నట్లు మాకు సమాచారం వచ్చింది. వీటిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశాం.

–వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ

యూరియా కోసం రైతుల అవస్థలు



యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

మద్దూరు: మండలంలో యూరియా కోసం రైతులు పడరాని అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అధికారులు శుక్రవారం యూరియా సరఫరా చేశారు. పీఏసీఎస్‌కు 450 బస్తాల యూరియా వచ్చిందని రైతులకు తెలియడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉదయాన్నే కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తె అవకాశం ఉండడంతో పోలీసులు క్యూలైన్ ఏర్పాటు చేసి యూరియాను అందించారు. దాదాపు 40 మందికి యూరియా అందకపోవడంతో టోకన్లను అందజేశారు. వారికి శనివారం యూరియాను అందజేయనున్నట్లు కోస్గి ఏడీఏ రామకృష్ణ తెలిపారు. శనివారం పంపిణీ చేయడానికి మరో 450 బస్తాల యూరియా వచ్చినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి



లింగయ్యను సన్మానిస్తున్న తపస్ నాయకులు

నారాయణపేట రూరల్: గతంలో నిర్వహించిన బదిలీలు, ఇటీవల జరిగిన పదోన్నతుల కారణంతో చాలా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుందని, విద్యార్థులకు నష్టం కలుగకుండా బోధకులను నియమించాలని తపస్ రాష్ట్ర, జిల్లా నాయకులు హనుమంతరావు, షేర్ కృష్ణారెడ్డి, నరసింహ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ లింగయ్యకు వేరువేరుగా వినతి పత్రం అందించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పదోన్నతులు కల్పించడంతో సంతోషదాయకమని, పదోన్నతులతో ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీ అయిన పోస్టులలో బోధన సహాయకులను నియమించాలని కోరారు. అలాగే సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

కోస్గి రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల పాలిటా శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోస్గి మండల అధ్యక్షుడు రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ దగ్గర సీపీఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో ఉపాధ్యాయులందరూ హాజరై ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు బాలకృష్ణ, ఉపేందర్, మాధవరెడ్డి, శ్రీదేవి, శశివర్ధన్, రాజశేఖరమూర్తి తదితరులు ఉన్నారు.

మాతృభాషను రక్షించుకుందాం



తెలుగు పండితులను సన్మానిస్తున్న సభ్యులు

నారాయణపేట రూరల్: పరభాషపై మోజు తగ్గించి మాతృభాషను రక్షించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజి అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా బాలకేంద్రంలో తెలుగు భాష దినోత్సవాన్ని ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్న నాటి నుంచే పిల్లలకు తెలుగు భాషతో పాటు రామాయణం, మహాభారతం, భగవద్గీత హనుమాన్ చాలిస పఠనం నేర్పించాలన్నారు. అనంతరం కవి పండితులు రామ్మోహన్ రావ్, చిన్నయ్య తో పాటు క్రీడా దినోత్సవం సందర్భంగా అథ్లెటిక్స్ కోచ్ హరికను జ్ఞాపికలతో సత్కరించి చిన్నారులకు మిఠాయిలను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు ఫ్యాన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, సంగ నర్సింహులు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు యశ్వంత్ లాండ్గే, రామకృష్ణ కళ్యాణి, వసంత్, జ్ఞానామృత పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



జాజాపూర్‌లో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు



మక్తల్‌లో వేడుకల్లో పాల్గొన్న క్రీడాకారులు

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ధ్యాన్ చంద్ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడల ప్రాముఖ్యతను వివరించి చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఆటలపై దృష్టి సారించాలి

మరికల్: మండల కేంద్రంలోని రిషి హైస్కూల్‌లో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాయతీ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కేవలం చదువుపై దృష్టి పెట్టకుండా క్రీడల్లోనూ రాణించి భవిష్యత్‌కు బాటలువేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల భారీ ర్యాలీ

మక్తల్: జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మక్తల్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి పాల్గొని విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో విద్యార్థలకు సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలోమాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, రహింపటేల్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

ఊట్కూరు: పట్టణంలో క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన పలు గణనాథులకు స్థానిక ఉత్సవ కమిటీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండపాలలో కొలువుదీరిన గణనాథులను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అలాగే వివిధ వార్డుల్లో నిర్వహించిన సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు, చిన్నారుల పోటీలను తిలకించారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, నందు నామాజీ, కన్నా శివకుమార్, శ్రవణ్, చందు, మురళీ బట్టడ్ పాల్గొన్నారు.

రెడ్డి సేవా సమితి ఏర్పాటు

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం గ్రామంలో శుక్రవారం నూతన రెడ్డి సేవా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పవన్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీరారెడ్డి, కోశాధికారిగా సోమేశ్వర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా విజయసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నర్సింహారెడ్డి, చిన్నారెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేకర్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మద్దూరు: ఓ విద్యార్థి తన పుట్టిన రోజు సందర్భంగా తోటి విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి పర్యావరణంపై తనకున్న ప్రేమను చాటుకుంది. మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఐశ్వర్య శుక్రవారం తన పుట్టిన రోజు జరుపుకుంది. ఈ క్రమంలో తల్లిదండ్రులతో కలిసి తోటి విద్యార్థులకు ఒక్కో మొక్క అందజేసి వాటిని పెంచాలని సూచించింది. విద్యార్థి ఆలోచనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ కోచ్‌కు సన్మానం



నారాయణపేట టౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని సందర్భంగా నారాయణపేట అథ్లెటిక్ కోచ్ అజయ్‌ను జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ తరపున అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్‌ను శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అజయ్ నారాయణపేట యువ క్రీడాకారుల కోసం ఎంతో కష్టపడ్డారన్నారు. సమ్మర్ క్యాంప్‌లో కూడా క్రీడాకారులకు ఉచితంగా క్రికెట్ కోచింగ్ ఇచ్చి ప్రోత్సహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సిములు, చెన్నారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపంలో చెస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న భగత్‌సింగ్ యూత్ సభ్యులు

మద్దూరు: పట్టణంలోని అమర్‌గడ్డ కాలనీలోని రామాలయంలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో ఓపెన్ టూ ఆల్, అండర్–14 విభాగంలో చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు అండర్–14 విభాగంలో 130 మంది విద్యార్థులు, ఓపెన్ టూ ఆల్‌లో 50 మంది చెస్ పోటీల్లో పాల్గొన్నారు. ఓపెన్ టూ ఆల్‌లో విజేతగా మక్తల్ చెందిన విశ్వచరణ్, రన్నరప్‌గా పట్టణానికి చెందిన శివశంకర్ గెలుపొందారు. అండర్–14 విభాగంలో మద్దూరు చెందిన అరవింద్ విజేతగా, రన్నరప్‌గా మహేష్ నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. భగత్ సింగ్ యూత్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చలానా పేరిట డాక్యుమెంట్ రైటర్ చేతివాటం

మక్తల్: మక్తల్ సబ్ రిజిష్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు ఆడిందే ఆట..పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చే పార్టీల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. మొయినుద్దిన్ అనే వ్యక్తి ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నెల క్రితం డాక్యుమెంట్ రైటర్ సమద్ దగ్గరకు వెళ్లాడు. అయితే అతను చలానా రూ.70వేలు కట్టి రూ.1.70 లక్షలు కట్టినట్లు చలానాలో పెన్‌తో మార్చి డాక్యుమెంటును తయారు చేశారు. చలానా అమౌంట్‌పై అనుమానం వచ్చిన మొయినుద్దీన్ శుక్రవారం సబ్ రిజిష్టర్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా రూ.70వేలు మాత్రమే కట్టినట్లు ఉంది. దీంతో బాధితుడు ఇంకొంత మందితో వచ్చి సమద్‌పై దాడి చేయబోగా స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే ఈ విషయంపై మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మొయినుద్దీన్, సమీన్ బేగం కుటుంబసభ్యుల పత్రాలను తారుమారు చేసినట్లు సమద్‌పై ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు స్పందించి సబ్ రిజిష్టర్ కార్యాలయంలో మోసాలకు పాల్పడుతున్న డాక్యుమెంట్ రైటర్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేడు వినియోగదారులకు అవగాహన సదస్సు

మహబూబ్‌నగర్ రూరల్: వినియోగదారుల హక్కులు, రక్షణపై నేను సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. స్థానిక టీఎన్జీఓస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్యఅతిథిగా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు అనురాధ హాజరుకానున్నారు. జిల్లాలోని వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్‌కుమార్ కోరారు.

దుస్తులు పంపిణీ

ఆత్మకూర్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రామకృష్ణరావు జ్ఞాపకార్థం దివాకర్‌రావు క్రీడాకారులకు ఉచితంగా క్రీడల దుస్తులను అందజేశారు. శుక్రవారం జాతర మైదానంలో 20 మందికి దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఖాదర్, డాక్టర్ సందీప్‌రెడ్డి, అజ్మతుల్లా, జిందేమురళీ, బాలు, సమీనా, వాహేద్, మస్తాన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



అమరచింత: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మండల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్షలు అప్పుచేసి బేస్‌మెంట్ నిర్మాణం చేసుకుని ఉన్న శిథిలావస్థలో ఉన్న నివాసం ఉన్న వారందరికి ఇళ్లను వర్తింప చేయాలన్నారు. హామీలను వెంటనే అమలు చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం



నారాయణపేట రూరల్: శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజకుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పేరపళ్ల మీది తండాలో శుక్రవారం నిర్వహించిన గిరిజన యువకుల ఐపీఎల్ క్రికెట్ ట్రోఫీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారించాలని, ఆటలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతత శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయికి ఈ ప్రాంత యువకులు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంతోష్, కిష్ట నాయక్ లష్కర్, గోపాల్, సురేష్, శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఏసీబీ బృందం తనిఖీ

దామరగిద్ద: మండలానికి చెందిన జ్యోతిరావ్ బాపులే గురుకుల పాఠశాలలో శుక్రవారం ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ బృందం తనిఖీ చేపట్టింది. పాఠశాలలో శానిటేషన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు పాఠశాలలో భోజనం, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తమ దృష్టికి వచ్చిన పలు విషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎస్పీ తెలిపారు.

పురపాలికకు చెత్త సేకరణ ఆటోలు మంజూరు

అమరచింత: మున్సిపాలిటీకి రెండు కొత్త చెత్తసేకరణ ఆటోలు మంజూరు అయ్యాయని మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ తెలిపారు. శుక్రవారం ఆటో తాళాలను షోరూం యజమాని ద్వారా అందుకున్నామన్నారు. చెత్త సేకరణ ఆటోలు మంజూరు కావడం హర్షనీయమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

నారాయణపేట టౌన్: దామరగిద్ద మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్గి ఉండాలని అదే విధంగా ప్రతి వ్యక్తి వారి హెచ్‌ఐవీ స్థితిని కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. అదే విధంగా హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, రాకుండా ఉండడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, సీఎల్ డబ్ల్యూ అశోక్, నరసింహులు పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ

నారాయణపేట రూరల్: 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్' అనే అంశంపై మూడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించారు. శుక్రవారం రెండో రోజు సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు హాజరై మాట్లాడుతూ.. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డాటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోడింగ్ డిజైన్ థింకింగ్ డిజిటల్ టెక్నాలజీ అనే అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం భౌతిక, జీవ, గణిత ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్నటువంటి విషయాలను పాఠశాలల్లో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి హెచ్ భానుప్రకాష్, శిక్షణ డీఆర్పీలు నారాయణ, ప్రవీణ్, తిప్పన, భాస్కర్, మల్లికార్జున్, డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్తను బయట పారబోస్తే జరిమానా

ఆత్మకూర్: చెత్తను ఆరుబయట పారబోస్తే రూ.10 వేలు జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అధికారులు, కార్మికులతో కలసి 100 రోజుల ప్రణాళిక, డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పలు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. అధికారులు అనూష, మోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు

నారాయణపేట క్రైమ్: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలోని ప్రార్థనా మందిరాలు, వినాయక మండపాల వద్ద డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఉత్సవాలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కంట పడితే వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలమని ఎస్పీ తెలిపారు.

మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిబ్బంది రమేష్ మాట్లాడుతూ గంజాయి, గుట్కాలు తదితర మత్తు పదార్థాలకు యువకులు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాము



నారాయణపేట రూరల్: అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి. రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర మొదటి మహాసభలలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతు, విద్యార్థి, ప్రజా ఉద్యమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. భగత్ సింగ్ యువజన సంఘం ఏర్పాటు చేయడంతో పాటు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంలో చురుకుగా పాల్గొన్నారని, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీగా ప్రజా ప్రతినిధి హోదా సైతం పొందడంతో ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసినట్లు తెలిపారు.

అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి



ఊట్కూరు: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూనిర్వాసితులకు మద్దతు తెలిపిన నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తే సహించమని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని పెంచాలని 42 రోజులుగా రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అలాగే రైతులకు మద్దతు తెలుపుతున్న నాయకులు వెంకటరామారెడ్డి, గోపాల్, అంజిలయ్య, వెంకట్‌రాములను అరెస్ట్ చేయడాన్ని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు.అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం



మద్దూరు: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా అన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు కోళ్లను పంపిణీ చేశారు. మద్దూరు మండలానికి 250 యూనిట్లు మంజూరు కాగా ఒక్కో యూనిట్‌కు 20 కోడి పిల్లలను చొప్పున పంపిణీ చేసినట్లు ఏపీఎం కృష్ణవేణి తెలిపారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకం కోసం రెండు యూనిట్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చేపట్టినా ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్, తహసీల్దార్ మహేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.